

'మిస్ తెలుగు యూఎస్ఏ' ఫైనల్స్‌కు ఎంపికైన గీతిక

గీతిక అదుర్స్

- 'మిస్ తెలుగు యూఎస్ఏ-2025' పోటీల్లో ఫైనల్స్‌కు ఎంపిక
- మే 25న డల్లాస్‌లో గ్రాండ్ ఫినాలే
- బోనకల్ మండలం ముష్టికుంట్లలో హర్షాతిరేకాలు
- విజయానికి తెలుగువారి ఓట్లే కీలకం

బోనకల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష గొప్పతనం, సంస్కృతిని అంతర్జాతీయ స్థాయిలో చాటేందుకు నిర్వహిస్తున్న 'మిస్ తెలుగు యూఎస్ఏ-2025' పోటీల్లో ఖమ్మం జిల్లా యువతి ఫైనల్‌కు చేరి జిల్లా కీర్తిని ఎగరేసింది. అమెరికాలోని తెలుగు యువతులకు మాత్రమే పరిమితమైన ఈ పోటీల్లో ఆమె అద్భుతమైన ప్రతిభను చాటుతుండటం విశేషం. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పిల్లలమర్రి శివ నర్సింహారావు కుమార్తె గీతిక 'మిస్ తెలుగు యుఎస్ఎ-2025' పోటీల్లో ఫైనలిస్టుగా ఎంపికైంది. గీతిక ప్రస్తుతం అమెరికాలోని సిన్సినాటి యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో ఎంఎస్ చదువుతోంది.

గ్రాండ్ ఫినాలె...

అమెరికాలోని డల్లాస్ ఇర్వింగ్ ఆర్ట్ సెంటర్ వేదికగా వచ్చే మే 25న గ్రాండ్ ఫినాలే జరగనుంది. ఈ పోటీలో గెలుపొందేందుకు ప్రపంచంలోని తెలుగు వారి ఓట్లే కీలకం. గీతికకు ఓటు వేయడం ద్వారా ఆమెను విజేతగా చూసే అవకాశం జిల్లా వాసులకు దక్కుతుంది. ఈ పోటీ వ్యక్తిత్వాన్ని, వ్యక్తిగత అభివృద్ధిని, ప్రతిభ, (మిగతా 6వ పేజీలో)

రేషన్ మాఫియా చెలరేగిపోతోంది. పేదలకు దక్కాల్సిన రేషన్‌బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తున్నారు. రాయితీపై ప్రభుత్వం అందించే బియ్యాన్ని అక్రమంగా సేకరించి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల కళ్లు కప్పి.. కిందిస్థాయి సిబ్బందికి మామూళ్లు ఇస్తూ విచ్చలవిడిగా దందా సాగిస్తున్నారు. బియ్యాన్ని రవాణా చేసే ముఠా అన్ని మండలాల్లోనూ నిఘా సిబ్బందిని, పౌరసరఫరాల అధికారులను కాసులతో కట్టేసి తమ గుప్పెట్లోకి తీసుకుని ప్రజాపంపిణీ వ్యవస్థను ఆటాడిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అల్లీపురం వద్ద పట్టుకున్న రేషన్‌బియ్యం లోడు

ఎవరొచ్చినా తగ్గేదేలే!

రెచ్చిపోతున్న రేషన్ బియ్యం మాఫియా

- ఖమ్మం నగరం నుంచి కాకినాడకు యథేచ్ఛగా అక్రమ రవాణా
- ప్రతీ నెల 50 లారీల బియ్యం తరలింపు
- నెలకు రూ.3కోట్లపైనే అక్రమార్జన
- స్థానిక ఆఫీసర్లకు, చెక్‌పోస్ట్ సిబ్బందికీ మామూళ్లు ?
- రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ దాడులతోనే పట్టుబడుతున్న బియ్యం
- నామమాత్రపు కేసులతో సరిపెడుతున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో కొందరు ముఠాగా ఏర్పడి ఖమ్మం నగరాన్ని ఏరియాల వారీగా పంచుకుని రేషన్ బియ్యం అక్రమంగా కాకినాడకు తరలిస్తున్నారు. నగరంలోని ముస్తఫానగర్, త్రీటౌన్, టూటౌన్ ఇలా ప్రాంతాల వారీగా పంచుకుని అక్కడి ముఠాసభ్యులు యథేచ్ఛగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఈ ముఠా సభ్యులు ప్రతిరోజు ఒక ప్రాంతాన్ని ఎంచుకుని ఆయా ఏరియాల్లో రేషన్ దుకాణాల్లో సేకరించిన బియ్యాన్ని ఆటోల్లో ఆ ప్రాంతానికి తరలించి లారీలో లోడ్ చేసి కాకినాడకు పంపిస్తున్నారు. ట్రాలీల్లో తరలించేందుకు ఒక కారును ఎస్కార్టుగా వినియోగిస్తూ రూట్ క్లియర్ చేసుకుంటూ ఎంపిక చేసిన ప్రాంతానికి బియ్యాన్ని తరలించేందుకు సినీఫక్కీలో ప్రణాళికలను అమలు చేస్తున్నారు.

గురువారం తెల్లవారు జామున అల్లీపురం వద్ద ఓ వెంచర్‌లో రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు లారీలో లోడ్ చేసిన 300క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు బొలెరో, రెండు ట్రాలీ ఆటోలు, ఒక కార్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందంలోని ఓఎస్డీ తెలిపిన వివరాల ప్రకారం.. మిల్లు నుంచి సీఎంఆర్ బియ్యాన్ని గోదాంకు తరలించేటప్పుడు వేసే ట్యాగులను కూడా తొలగించకుండానే అక్రమార్కులు నేరుగా లారీకి రేషన్ బియ్యాన్ని



బస్తాలకు ట్యాగులు కూడా తీయకుండా ఉన్న దృశ్యం

లోడ్‌చేస్తుండడం మరింత విస్మయానికి గురిచేస్తోంది. ఖమ్మం నగరంలో 100దుకాణాలు, చుట్టుపక్కన ప్రాంతాల్లోని ముదిగొండ, ఖమ్మంరూరల్, అర్బన్, చింతకాని, నేలకొండపల్లి ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. తనకు ఉన్న అనుచరులు ముఠాగా ఏర్పడి చిన్నచిన్న వ్యాపారుల నుంచి ద్విచక్రవాహనాలు, ట్రాలీ ఆటోలు, డీసీఎంల ద్వారా బియ్యాన్ని సేకరిస్తున్నారు. సేకరించిన ఈ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి ఎవ్వరికీ అనుమానం రాకుండా ఉదయం 6గంటల నుంచి 7.30లోపే కాకినాడకు తరలిస్తున్నట్లు సమాచారం. కనీసం 15మంది సభ్యుల ముఠా నగరంలో బియ్యం మాఫియా నిర్వహిస్తూ ప్రతినెల కనీసం 50లోడ్లను తరలిస్తున్నట్లు సమాచారం.

అంతా బహిరంగమే..

బియ్యం అక్రమరవాణా తతంగం అంతా పోలీసు, (మిగతా 6వ పేజీలో)



హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న దృశ్యం

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఖమ్మం జిల్లాలో 16,788.. భద్రాద్రి జిల్లాలో 12,282 మంది విద్యార్థులు

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 97 పరీక్ష కేంద్రాల్లో 16,788 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పరిధిలోని 282 పాఠశాలల నుంచి 10,204 మంది, 142 ప్రైవేటు పాఠశాలల నుంచి 6,584 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇక భద్రాది కొత్తగూడెం జిల్లాలో 73 కేంద్రాల్లో 12,282 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. శుక్రవారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు మాత్రం ఉదయం 9.30గంటల నుంచి 11.00 గంటల వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

పరీక్ష సమయానికి అనుకులంగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీచేసింది. విద్యాశాఖతో సంబంధం లేని అధికారులను (మిగతా 6వ పేజీలో)

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఇళ్లకు తిరుగుముఖం పట్టిన విద్యార్థులు 6



కల్లూరు మండలం యర్రబోయినపల్లి సభలో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి

బీఆర్ఎస్ పాలనలో యథేచ్ఛగా దోపిడీ

- ఇష్టారాజ్యంగా అప్పులు చేశారు.
- ప్రతీ నెల రూ.6500 కోట్ల వడ్డీ కడుతున్నాం
- ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

6



వైరాలో అభివాదం చేస్తున్న రైతుసంఘం నాయకులు

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రైతుల సంక్షేమం, అభివృద్ధి పట్టని మోదీ ప్రభుత్వం
- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. హేమంతరావు

తాగుబోతు కొడుకును

కడతేర్చిన తల్లి

వేధింపులు తీవ్రం కావడమే కారణం ● భద్రాద్రి జిల్లా ఎదురుగడ్డలో ఘటన

లక్ష్మీదేవిపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటికి యజమాని అతడు.. బాధ్యతగా వ్యవహరిస్తూ తల్లిని, భార్యాబిడ్డలను పోషించాలి.. కానీ మద్యానికి బానిసయ్యాడు.. కుటుంబానికి పట్టించుకోకుండా బలాదూర్‌గా తిరగడం అలవాటు చేసుకున్నాడు.. ఏ పనీ చేయకుండా తల్లి, భార్య సంపాదనపై ఆధారపడుతూ తాగుబోతుగా మారాడు.. ఆ మత్తులో తల్లిని, భార్యాబిడ్డలను వేధించడం మొదలుపెట్టాడు. అతడి ప్రవర్తనను భరించలేని తల్లి... కన్నపేగు మమకారాన్ని అణచుకొని కొడుకును కడతేర్చింది.. కలకలం రేపిన ఈ ఘటన భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తితే..

ఎదురుగడ్డ గ్రామానికి చెందిన ఎలకపల్లి రాజ్‌కుమార్(40).. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇతనికి తల్లి దూడమ్మ, భార్య,



మృతి చెందిన రాజ్‌కుమార్

కొడుకు వున్నారు. పనీపాట లేకుండా నిత్యం తాగివచ్చి తల్లి సహా భార్యాబిడ్డలను వేధిస్తున్నాడు. పద్ధతి మార్చుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా రాజ్‌కుమార్‌లో మార్పు రాలేదు. దీంతో వారు తీవ్రంగా విసిగిపోయారు. అతడి తీరు వల్ల బతుకు నరకప్రాయంగా మారింది. గురువారం కూడా రాజ్‌కుమార్ యథావిధిగా ఫుల్లుగా తాగి (మిగతా 6వ పేజీలో)



నగదును బ్యాంకు అధికారులకు అందజేస్తున్న ఈవో

భద్రాద్రి రామయ్యకు కాసుల పంట

- నెలన్నర వ్యవధిలో రూ.1.14 కోట్ల ఆదాయం

భద్రాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి రూ.1,14,60,041 ఆదాయం లభించింది. గురువారం రామాలయంలోని హుండీలను తెరిచి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో రూ.1,14,60,041 నగదు, 133 గ్రాముల బంగారం, 1262 గ్రాముల వెండి లభించింది. అలాగే 50 కెనడా డాలర్స్, 293 యూఎస్ డాలర్లు, 10 యూరోలతో పాటు ఇతర దేశాల కరెన్సీ లభించింది. కాగా ఆలయ హుండీలను చివరగా ఫిబ్రవరి ఆరో తేదీన లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

జమలాపురం వెంకన్న హుండీ ఆదాయం రూ. 32 లక్షలు 7



విజి'లెన్స్'కూ చిక్కడం లేదు..

- కేఎంసీలో అక్రమాలపై జాడ లేని చర్యలు
- ఇంటినెంబర్ల కేటాయింపు, జీవో 58,59 క్రమబద్ధీకరణ ప్రతులు అడిగిన విజిలెన్సు అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' కథనాలను ఉటంకిస్తూ లేఖ
- ఐదు నెలలు గడిచినా ఉలుకూపలుకూ లేని కేఎంసీ
- అక్రమార్కులు ఆడిందే ఆటగా మారిన వైనం
- తాజాగా 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కిన విజిలెన్స్ లేఖ

ఖమ్మం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) పరిధిలో ఇంటి నెంబర్ల కేటాయింపు, అసెస్‌మెంట్లలో పెద్దఎత్తున అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. అందినకాడికి దండుకుని అడ్డగోలుగా ప్రభుత్వ భూములకు, అసైన్డ్ భూములకు, నిర్మాణాలు లేని స్థలాలకు అసెస్‌మెంట్లు వేసి అడ్డంగా బుక్కయ్యారు కొందరు అధికారులు. అంతేకాదు దొంగ అసెస్‌మెంట్ల ద్వారా కొందరు అక్రమార్కులు జీవో 58,59 ద్వారా ఖమ్మం నగరంలో సుమారు 6వేల గజాలను క్రమబద్ధీకరించుకున్నారు. ఈ అక్రమాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వీటిపై కేఎంసీ ఉన్నతాధికారులు శాఖాపరంగా ఎలాంటి విచారణ నిర్వహించనప్పటికీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాత్రం స్పందించారు. వారు గత ఏడాది అక్టోబరులో కేఎంసీ కార్యాలయానికి లేఖ పంపించారు. ఆ లేఖ ఐదు నెలల తర్వాత 'ఆంధ్రజ్యోతి'కి చిక్కింది.

ఆంధ్రజ్యోతి చేతికి చిక్కిన లేఖ

కేఎంసీలో అధికారులు అక్రమాలకు పాల్పడిన అంశాలపై గతేడాది అక్టోబరు 14న అడిషనల్ సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్, రిజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ. బాలకోటి నుంచి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి లేఖ నెంబరు: ఎల్ఆర్.07/ఆర్‌వీఈవో/డబ్ల్యూజీఎల్/ డీఈవీ/ఐవోపీ(హెచ్)/2024 ను పంపించారు. సదరు లేఖలో 9 పాయింట్లలో పలు అక్రమాలకు సంబంధించిన వివరాలను పంపించాలని పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్లు కూరపాటి శ్రీనివాస్, పి.జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ పి.లోకేష్ కుమార్‌తోపాటు, స్టోర్ కీపర్‌గా పనిచేస్తున్న పి.విజయ్‌కుమార్‌లకు వారు కేఎంసీలో చేరినప్పటి నుంచి కేటాయించిన విభాగాలు, చేసిన పనులు వివరాలు తెలపాలని పేర్కొన్నారు. ఆయా అధికారులు వారి కాలంలో ఇంటి నెంబర్ల కేటాయింపు కోసం నిర్వహించిన ఫైళ్ల వివరాలను అందించాలన్నారు. గైర్హాజరైన కార్మికుల స్థానంలో బయటి వ్యక్తులను పెట్టడంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కూరపాటి శ్రీనివాస్ అయితే (మిగతా 6వ పేజీలో)

వసతులున్నా.. వైద్యులేరీ ? 7

- మణుగూరు ఏరియా ఆస్పత్రి తీరు

నేటి నుంచి నాటక పోటీలు 7

- మధిరలో ఏర్పాట్లు పూర్తి

ఉలిక్కిపడ్డ రవాణా శాఖ 7

- ఏసీబీ దాడుల ప్రచారంతో గప్‌చుప్

ఫటాఫట్



ఐదు రోజుల పనివిధానం అమలు చేయాలి

ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసిస్టెంట్‌జనరల్ సెక్రటరీ షేక్ ఇబ్రహీం

ప్రశ్న: బ్యాంకు అధికారులు, ఉద్యోగులు 24, 25 తేదీల్లో సమ్మెకు పిలుపునివ్వడానికి కారణం ఏమిటి?

జ: దేశవ్యాప్తంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో గుర్తింపుపొందిన బ్యాంక్ ఆఫీసర్స్ డిమాండ్ల సాధనకోసం ఉద్యమం చేపట్టాం. అందులో భాగంగా ఈనెల 24, 25న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. అయితే ఈనెల 21వ తేదీన ఢిల్లీలో చీఫ్ లేబర్ కమిషనర్ చర్చలకు ఆహ్వానించారు. చర్చలు ఫలిస్తే ఆందోళన కార్యక్రమం ఆగిపోతుంది. లేకుంటే కొనసాగుతుంది. ముందుగా ఈనెల 21వ తేదీన సాయంత్రం ఖమ్మంలో కూడా ప్రధాన బ్యాంకు ల ఆఫీసర్స్, ఉద్యోగుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తాం.

ప్ర: ఆంధ్రజ్యోతి: మీ డిమాండ్లు ఏమిటి

జ: ప్రధానంగా ఆరు డిమాడ్లను ఇప్పటికే తెలియజేశాం. గతంలో పలుసార్లు చర్చలు జరిగినా వాటి మీద స్పందన లేదు. ప్రతి బ్యాంకుల్లోని అన్నిస్థాయిలో రిక్రూట్‌మెంట్లు జరపాలని, ఆఫీసర్ స్థాయి నుంచి కింది స్థాయి కేడర్ వరకు పోస్టులు భర్తీచేయాలన్నది మా ప్రధాన డిమాండ్.

ప్ర: ఇతర డిమాండ్లు ఏమైనా ఉన్నాయా?

జ: గ్రాట్యుటీని రూ.20లక్షల వరకే ఇస్తున్నారు. దీనిని రూ.25లక్షలకు పెంచాలని సూచిస్తున్నాం. బ్యాంకుల్లో ఐదు రోజుల పని విధానం అమలుచేయాలి. తద్వారా బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి భారం తగ్గుతుంది. ప్రతి ఉద్యోగి పెర్‌ఫార్మెన్స్‌పై రివ్యూ విధానం ఎత్తివేయాలి. ఉద్యోగికి టార్గెట్లు పెట్టి వ్యక్తిగత పెర్‌ఫార్మెన్స్‌తో ఒత్తిడికి గురిచేస్తున్నారు.

ప్ర: ఐదురోజుల పని విధానంతో ఖాతాదారులకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉండదా?

జ: ఇబ్బందులు ఏమీ ఉండవు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా బ్యాంకులనుంచి సేవలందిస్తాం. ఇందుకోసం బ్యాంకుల్లో ఆఫీసర్స్ స్థాయినుంచి డైరెక్టర్ స్థాయివరకు ఖాళీగా ఉన్న పోస్టులనభర్తీచేయాలని సూచించాం.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

ఎవరొచ్చినా తగ్గేదేలే !

(5వ పేజీ తరువాయి)

సివిల్‌సప్లయిస్ అధికారులకు తెలిసే జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులనే అక్రమార్కులు బుకాయించడం గమనార్హం. 'మీకు అందలేదా సార్.. మా వాళ్లు మిమ్ముల్ని కలవలేదా సార్.. ఎందుకు ఇదంతా చేస్తున్నారు' అంటూ బుకాయించడం గమనార్హం. ఆటోల నుంచి బియ్యం బయల్దేరే విషయం రూట్‌లోని అన్ని నిఘా అధికారులకు, సిబ్బందికి సమాచారం ఉంటుందనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. రవాణా చేసే ముఠా సభ్యులు ప్రతినెలా వారికి రూ.50వేలకు పైగానే సమర్పించుకుంటున్నట్లు సమాచారం.

రాత్రి వేళల్లో బియ్యాన్ని రవాణా చేసే లారీల నెంబర్లు చూడగానే వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ నిఘా సిబ్బందికి తెలియకుండా విజిలెన్స్ ఇతరత్రా అధికారులు పట్టుకుంటే ఫోన్ల ద్వారా లాబీయింగ్ చేసి యథేచ్ఛగా విడిపించుకుని వెళ్తున్నట్లు తెలుస్తోంది. తప్పనిసరిగా కేసు చేయాల్సి వస్తే ముఠాలో ఉన్న అనుచరులనే అరెస్టు చేసి నా మ మాత్రపు కేసులు పెట్టి వదిలిపెట్టి అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నెలకు రూ.3కోట్లకు పైనే..

రేషన్ బియ్యం ప్రతినెల 1నుంచి 18వ తేదీ లోపు ఇస్తుంటారు. ఆ బియ్యాన్ని వినియోగదారుడి నుంచి కేజీ రూ.6చొప్పున చిన్నచిన్నవ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వారినుంచి బల్క్‌గా మాఫియా వ్యక్తులు రూ.12కి కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు చేరవేసి కేజీ రూ.22కు విక్రయిస్తున్నట్లు సమాచారం. అంటే ప్రతినెలా కనీసం 50లారీల్లో కనీసం 2,100మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ట్లు సమాచారం. తద్వారా ప్రతి నెల రూ.5కోట్ల ఆదాయం వస్తుండగా వచ్చే అక్రమార్జన నుం చి అధికారులకు, చెక్‌పోస్టుల వద్ద ప్రతి నెలా 50 వేల చొప్పున మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. రవాణా, మామూళ్ల ఖర్చులన్నీ పోను నెలకు కనీసం రూ.2నుంచి 3కోట్లు మిగులుతుండడంతో అక్రమార్కులు ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. గత నెలలో కొణిజర్ల వద్ద అక్రమంగా తరలిస్తున్న ఓ లారీలో 450 క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకొని కేసు నమోదు చేసింది. వారు కూడా తాజాగా పట్టుబడిన ముఠాకు చెందిన వారేనని అధికారులు గుర్తించారు.

300 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఖమ్మం నగరంలోని అల్లీపురం సమీపంలో ఒక వెంచర్‌లో గురువారం తెల్లవారు జామున రాష్ట్ర సివిల్‌సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ బృందం ఓఎస్డీ బుడిగ అంజయ్య, ఏసీపీ యాదయ్య, ఎంఆర్‌వో కమిల్‌పాషా, ఎస్‌ఐ స్వామిదాస్, ఏఎస్‌ఐ శ్రీనివాస్ రేషన్ బియ్యంను పట్టుకున్నారు. వెంచర్‌లో అప్పటికే లారీలో బియ్యం లోడ్ చేసి ఉంచగా టాస్క్‌ఫోర్స్ బృందం అప్పటికే నిఘా వేసి అక్కడే ఉండగా మరో రెండు ఆటోలో అక్రమార్కులు బియ్యాన్ని తీసుకొచ్చారు. దానికి ముందు ఎస్కార్ట్‌గా ఒక కారు రావడంతో అక్రమార్కుల గుట్టురట్టయ్యింది. ట్రాస్క్‌ఫోర్స్ అధికారులు సుమారు 300 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఖమ్మం అర్బన్ ఎమ్మెల్సీ పాయింట్‌కు తరలించారు. లారీ, రెండు ట్రాలీలు, ఒక కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మిషన్ భగీరథ ఎస్‌ఈగా శేఖర్‌రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ఎస్‌ఈగా జి. శేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం జగిత్యాలలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే శాఖపరమైన పదోన్నతుల్లో ఈఈగా పనిచేస్తున్న శేఖర్‌రెడ్డికి ఎస్‌ఈగా పదోన్నతి కల్పించారు. ఖమ్మం ఎస్‌ఈగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి లోకేష్ కుమార్ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన శివకుమార్ గత నెల పదవీవిరమణ పొందారు. ఈ నేపథ్యంలో ఖమ్మంలో ఎస్‌ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ స్థానంలో శేఖర్ రెడ్డిని నియమించారు. నూతన ఎస్‌ఈగా శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

'సీతారామ'పై చిత్తశుద్ధి లేదు

- రూ.2వేల కోట్ల నుంచి రూ.18వేల కోట్లకు పెంపు
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై చిన్నచూపు
- ముగ్గురు మంత్రులున్నా జిల్లాకు నిష్ప్రయోజనం
- సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి పోతినేని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్ రావు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయటంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, తాజాగా ప్రకటించిన బడ్జెట్‌లో నిధులు కేటాయింపు ఇందుకు సాక్ష్యంగా ఉందని, రాష్ట్ర బడ్జెట్‌ను రీబడ్జెట్ చేసి సవరించి తిరిగి ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు ధ్వజమెత్తారు. గురువారం ఖమ్మం సీపీఎం కార్యాలయం సుందరయ్యభవన్‌లో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు. బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. 2002లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చేపట్టిన మహాప్రస్థానం పాదయాత్రతో సీతారామ ప్రాజెక్టుకు ఆలోచన జరిగిందన్నారు. తర్వాత 2016లో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.7,800 కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపనలు చేశారని, ఇప్పుడు ఆదే ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.18 వేల కోట్లకు చేరిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సీతారామకు కేటాయించిన నిధుల తీరు చూస్తేంటే మరో పదేళ్ల వరకు పూర్తి కాదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గంలో సాగు నీరు అందని దుస్థితిలో రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయ, విద్యావైద్య రంగాలకు కనీస నిధులు కేటాయింపు జరపలేదని, గతేడాది బడ్జెట్‌ను రూ.2,91,000 కోట్లకు ప్రకటించి రూ.2,38,000 వ్యయం చూపారని, ఇప్పుడు పెంచిన బడ్జెట్‌ను అమలు చేస్తారనే నమ్మకం ప్రజలకు లేదన్నారు. సీతారామ ప్రాజెక్టు నిధులు కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చూడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్, యర్రా శ్రీకాంత్, వై విక్రమ్, గోపాల్‌రావు పాల్గొన్నారు.

శాంపిల్స్ సేకరణకు టెండర్ల ఆహ్వానం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ల్యాబ్ శాంపిల్స్‌ను సేకరించి వాటిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు చేర్చేందుకు ఐదు వాహనాలు సమకూర్చేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ నుంచి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతిబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనం నెలకు 2,500కి.మీ. తిరగాలని, ఒక్కొక్క వాహనానికి నెలకు రూ.33వేల అద్దె చెల్లిస్తామని తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్ ఐదేళ్లలోపు ఉండి, ఎల్లో ప్లేట్ వెహికల్స్‌ను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీలు సీల్డ్ టెండర్ దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో మార్చి 29వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా

నెల్లూరి బాధ్యతల స్వీకరణ



కోటేశ్వరరావును సన్మానిస్తున్న శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ

ఖమ్మం బైపాస్‌రోడ్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన నెల్లూరి కోటేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. నగరంలోని బైపాస్‌రోడ్డు సమీపంలోని రామాలయంలోని ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాట్లాడిన అనంతరం నెల్లూరి కోటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్‌కు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల పాలన కుంటుపడకుండా అధికార యంత్రాంగం సుపరిపాలనపై దృష్టిపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు గంటేల విద్యాసాగర్‌రావు, నంబూరి రామలింగేశ్వరరావు మంద సరస్వతి, శ్యాంరాథోడ్, రవీంద్ర, ఏలూరి నాగేశ్వరరావు, సంతోష్‌రెడ్డి, అల్లిక అంజయ్య, విజయారెడ్డి, కుమిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్



రామాలయంలో అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి

భద్రాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామిని రాష్ట్ర దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి దర్శించుకున్నారు. గురువారం రామయ్యను దర్శించేందుకు వచ్చిన ఆమెకు దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆమె వెంట భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వరంగల్ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇలా ఉండగా కృష్ణవేణిని శ్రీరామనవమికి ముఖ్య ఉత్సవ అధికారిగా నియమించినట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ పాలనలో యథేచ్ఛగా దోపిడీ

- మంత్రి పొంగులేటి

కల్లూరు, పెనుబల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) గత బీఆర్ఎస్ పాలనలో ప్రజల సొమ్ము దోచుకొని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి చేర్చారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కల్లూరు, పెనుబల్లి మండలాలోని పలు గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ గృహ నిర్మాణానికి, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో 8,900 లక్షల కోట్లు అప్పులు చేయగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెల రూ.6,500 కోట్లు వడ్డీ కడుతున్నామని మంత్రి అన్నారు.

రాబోయే నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లను నిర్మించే దిశగా కృషి చేస్తున్నమన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదవాడికి అండగా నిలుస్తుందన్నారు. గత పాలనలో జరిగిన పొరపాట్లను సరి చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఎకరాకి రూ. 12 వేలు రైతు భరోసా కింద మొదటి విడత రూ.6 వేలు నెలాఖరులోగా అందరికి అందజేస్తామని అన్నారు.

ఈ యాసంగిలో రైతులకు బోనస్ ఇస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఉగాది నుంచి సన్న రకం బియ్యం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. స్థానికంగా అటవీ భూముల వివాదాలను రాబోయే 20 రోజుల్లో పరిష్కరించాలని మంత్రి పొంగులేటి అధికారులు సూచించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా కాల్వల కింది తూము నిర్మించి రామచంద్రపురం, ఎరుగట్ల గ్రామాల చెరువు నింపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. యర్రబోయనపల్లిలో మొద్దుల చెరువు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి సంబంధిత అధికారులను ఆదేశించారు.

పలు అభివృద్ధి పనులు

కల్లూరు మండల పరిధిలోని యర్రబోయనపల్లి గ్రామంలో రూ. 1.77 కోట్ల అంచనాతో చేపట్టిన సీసీ, రహదారుల డ్రైన్ల నిర్మాణానికి, పెద్దకోరుకొండిలో రూ.95 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణానికి, రూ.25 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. పెనుబల్లి మండలంలోని రామచంద్రపురంలో ఇందిరమ్మ ఇంటికి, సీసీ రహదారుల, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్డీవో రాజేంద్రగౌడ్, రాష్ట్ర ఇరిగేషన్ అభివద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్, టీడీపీ నాయకులు పసుమర్తి చందర్‌రావు, పోట్రు అర్జునరావు, కాకర్ల రంగారావు, బత్తుల రాము, పోట్రు శ్రీను, పాలడగు రవీంద్ర, ఎస్కే కరీముల్లా, కీసర శ్రీనివాసరెడ్డి, వంది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు

వైరా, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుతం దేశంలో వ్యవసాయరంగ పరిస్థితి జై కిసాన్, జైజవాన్ స్థానంలో జై అదానీ, జై అంబానీగా తయారైంది..' అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు విమర్శించారు. వ్యవసాయ రంగంపై కార్పొరేటర్ల కన్ను పడిందని, ప్రధాని మోదీ హామీలు నీటిమూటలుగానే మారాయని ఆక్షేపించారు. వైరాలోని కమ్మవారి కల్యాణమండపంలో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా 21వ మహాసభలను హేమంతరావు ప్రారంభించి ప్రసంగించారు.

పోరాటాల ద్వారానే రైతుల, వ్యవసాయరంగ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుండా వ్యవసాయ రంగం సంక్షోభం వీడదని స్పష్టం చేశారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు చెందిన 16.5లక్షల కోట్ల రుణాలను రద్దుచేసిన మోదీ ప్రభుత్వం రైతుల రుణాల రద్దు విషయంలో ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. సీతారామ ప్రాజెక్టు అంచనాల వ్యయం పెరుగుతుంది తప్ప ప్రాజెక్టు పూర్తికావడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండులక్షల రుణమాఫీ, రైతుభరోసా అమలులో పూర్తిగా విఫలమైందని, రైతుల ఆగ్రహం ముందు ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని హెచ్చరించారు.

ఈ సభలకు దొండపాటి రమేష్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జక్కుల రామారావు, బాణోతు రవి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. రైతుసంఘ పతాకాన్ని బండారుపల్లి ముత్తయ్య ఆవిష్కరించగా అమరవీరుల స్థూపాన్ని బాగం హేమంతరావు ఆవిష్కరించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి రమేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, నాయకులు దొండపాటి రమేష్, ఎర్రా బాబు, మెడికంటి వెంకటరెడ్డి, జాగర్లమూడి రంజిత్, యామాల గోపాలరావు, ఏపూరి లతాదేవి, సింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, అడపా రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీకి రికార్డు స్థాయిలో ఆదాయ వసూళ్లు

- ఒకే రోజు రూ.70 లక్షల ఆదాయం
- 84ప్రభుత్వశాఖలకు కమిషనర్ నోటీసులు
- విద్యుత్‌శాఖ నుంచి రూ.40 లక్షలు వసూళ్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతి ఖమ్మం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆదాయ వసూళ్లలో ఖమ్మం నగర పాలక సంస్థ గురువారం కొత్త రికార్డును కైవసం చేసుకొంది. ఒకే రోజు రూ.70 లక్షల ఆదాయ వసూళ్లు జరిగాయి. ఈనెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'సర్కారు బకాయిలు వసూలయ్యేనా?' కథనంపై కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. ఖమ్మం నగరం పరిధిలో ఉన్న 84ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ద్వారా కమిషనర్ నోటీసులు పంపారు. అన్ని ప్రభుత్వశాఖల నుంచి రూ.6 కోట్లు వరకు కేఎంసీకి రావాల్సి ఉంది. కలెక్టరేట్, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఆస్పత్రి, రహదారులు భవనాలశాఖ ఇతర కార్యాలయాలకు నోటీసులు పంపారు. దీంతో విద్యుత్ శాఖ నుంచి రూ.40 లక్షల పెండింగ్ బకాయిలు వసూళ్లు జరిగాయి. కొత్త బస్టాండ్ నిర్వాహకులైన ఆర్టీసీకి రూ.10 లక్షల ఆదాయ వసూళ్లపై ఆర్వో శ్రీనివాసరావు ద్వారా నోటీసులు పంపారు. బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు ప్రతి రోజు కమర్షియల్, నివాసాల ఆదాయ వసూళ్లు చేస్తుండగా కమిషనర్ అభిషేక్ ప్రభుత్వశాఖల నుంచి ఆదాయ వసూళ్లపై దృష్టి సారించారు. దీంతో కేఎంసీ ఖజానా రూ.26 కోట్లతో కాసుల గల గల లాడుతోంది.

విజి'లెన్స్'కూ చిక్కడం లేదు...

(5వ పేజీ తరువాయి)

దాని వివరాలు అందించాలని పేర్కొన్నారు. జీవో నెం.58,59 ద్వారా నియమనిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరించిన కాపీలు పంపాలని సూచించారు.

ఆంధ్రజ్యోతిలో 'ఇంటిదొంగలు, భూదందా' వంటి శీర్షికలతో ప్రచురితమైన కథనాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఆ నివేదికను సమర్పించాలని పేర్కొన్నారు. వాటితోపాటుగా స్టోర్ మెటీరియల్ దొంగతనం, అమ్మకం, కార్మికుల నియామకాలకు సంబంధించిన మరికొన్ని ప్రశ్నలు అడిగారు. విజిలెన్స్ లేఖను ఆధారంగా చేసుకుని కార్పొరేషన్ ఏఎంసీ షఫీ ఉల్లా విచారణ చేపట్టగా ఆయా వివరాలను సంబంధిత విభాగ అధికారులను ఫైళ్ల వివరాలు అందించాలని అడిగారు.

ఇది జరిగి ఐదు నెలలు కావొస్తున్నప్పటికీ నేటివరకు ఆయా ఫైళ్ల వివరాలను అందించకపోవడం వెనుక ఆంతర్యమేంటన్న వాదన వినిపిస్తోంది. అసెస్‌మెంట్లు వేసిన ఫైళ్ల వివరాలు ఉన్నాయా? ఉంటే ఎందుకంత జాప్యం చేస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. దొంగ అసెస్‌మెంట్లు వేసిన ఫైళ్లను మాయం చేసే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారన్న ఆరోపణలు లేకపోలేదు.

మారని తీరు

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో ఇంటి నెంబర్ల కేటాయింపులకు సంబంధించి అక్రమాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ అధికారులు మాత్రం తీరు మార్చుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. దొంగ అసెస్‌మెంట్లపై ఎలాంటి శాఖాపరమైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఆ విభాగంలో పనిచేస్తున్న మరికొందరు అధికారులు తమ తీరు మార్చుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం సెల్ఫ్ అసెస్‌మెంట్లకు సంబంధించిన ఫైలు వచ్చిన సమయంలో పరిశీలనకు వెళ్లిన బిల్ కలెక్టర్లు, ఆర్‌ఐలలో కొందరు ఫైళ్లను రిజెక్ట్ చేసినప్పటికీ వారికి సంబంధంలేకుండానే అప్రూవల్ ఇస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

కాగా ఖమ్మం నగరంలో గొల్లగూడెం పరిధిలో ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో 6 వేల గజాలు ఉన్న ఓ మామిడితోటలోని చిన్న షెడ్డుకు ఇంటి నెంబరు కేటాయించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి ఉన్న స్థలానికి తగ్గట్టుగా నిర్మాణం ఉన్నప్పుడు మాత్రమే ప్రాపర్టీ ట్యాక్స్ విధించాలి. అంతపెద్దమొత్తం స్థలంలో చిన్న ఇంటి నిర్మాణం ఉంటే వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ వేయాల్సి ఉంటుంది. కాని అధికారులు మాత్రం దర్జాగా ఆ ఇంటికి నెంబరు కేటాయించడం కొసమెరుపు.

గీతిక అదుర్స్

(5వ పేజీ తరువాయి)

తెలివితేటలు, నాయకత్వాన్ని ప్రదర్శించే అవకాశం కల్పిస్తుంది. ఇది కేవలం కిరీటం ధరింపజేసే పోటీ మాత్రమే కాకుండా మహిళలను నాయకత్వానికి, విజయం సాధించేందుకు, సమాజం పై శాశ్వత ప్రభావాన్ని చూపేందుకు ప్రేరిపించే వేదిక అని ప్రవాసాంధ్రులు చెబుతున్నారు.

గత ఏడాది నవంబర్లో ప్రారంభమైన మిస్ తెలుగు యుఎస్ఏ పోటీల్లో అనేక మంది పాల్గొన్నారు. గీతిక తన ప్రతిభతో డిసెంబర్‌లో ప్రకటించిన 25 మంది ఫైనలిస్టుల్లో స్థానం దక్కించుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో గీతిక అకౌంట్‌ను అనుసరించి ఓటు వేసి ఆమె విజయంలో భాగస్వామ్యులు కావాలని తండ్రి శివ నర్సింహారావు కోరుతున్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ వార్షిక పరీక్షలు మార్చి 5న ప్రారంభమయ్యాయి. పరీక్షలు ముగియటంతో విద్యార్థులు ఇంటికి బయలుదేరారు. దీంతో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్ల ప్రదేశాలు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిక్కిరిశాయి. దీంతో సందడి వాతావరణం నెలకొంది. కళాశాలలు, హాస్టల్స్ వద్ద సందడి వాతారణం నెలకొంది. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 17,783 మందికి గాను14,533 మంది పరీక్షకు హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,877 మందికి 16,627 మంది పరీక్షకు హాజరయ్యారు. కాగా, గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షల్లో రెండు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేసినట్లు డీఐఈవో కె. రవిబాబు తెలిపారు. నగరంలోని రెండు ప్రైవేటు కళాశాలల పరీక్ష కేంద్రాలలో ఈ కేసులు నమోదు అయినట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సిట్టింగ్ స్క్వాడ్‌లుగా నియమించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు, పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి పరీక్షలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష సమయానికి గంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభ సమయం దాటిన 5 నిమిషాల వరకు కూడా లోనికి వెళ్లే వీలుంటుంది. కానీ ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించరు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే కేంద్రాలలోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాలలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. అధికారులు, స్క్వాడ్స్ కూడా సెల్‌ఫోన్‌లు వాడకూడదు.

ఖమ్మం జిల్లాలో 97 పరీక్ష కేంద్రాల్లో ఏ-కేటగిరీలో 61, బీ- కేటగిరీలో 16, సీ- కేటగిరీలో 20గా విభజించారు. పరీక్ష కేంద్రాల దగ్గరలోని కాపీయింగ్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీచేశారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 97 సిట్టింగ్ స్క్వాడ్స్, 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 98 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1,595 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

24 పేజీల బుక్‌లెట్

విద్యార్థులు జవాబులు రాసేందుకు గత ఏడాది వరకు విడివిడిగా జవాబు పత్రాలను అందించేవారు. దీంతో విద్యార్థులకు, ఇన్విజిలేటర్లకు కొంత సమయం వృథాగా పోయేది. ఈ ఏడాది విద్యార్థులకు ప్రశ్న పత్రంతోపాటు 24 పేజీల బుక్‌లెట్‌ను ఒకేసారి అందించనున్నారు. దీంతో విద్యార్థులకు కొంత సమయం ఆదా కానున్నది. ఈ 24 పేజీల బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. ఒక విద్యార్థికి ఒక్క బుక్‌లెట్‌నే అందించనున్నారు. పదోతరగతి ప్రశ్నపత్రంపై ఈ ఏడాది క్యూఆర్ కోడ్ తోపాటు ఒక సీరియల్ నెంబరును ముద్రించారు. ఎక్కడైనా ప్రశ్నపత్రం ముందే బయటకు వస్తే వెంటనే గుర్తించేందుకు ఈ క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుంది.

పరీక్షల నేపథ్యంలో కొత్తగూడెంలోని బాబు క్యాంప్ ప్రభుత్వ హైస్కూల్, సింగరేణి బాలికల ప్రాథమికోన్నత పాఠశాలల్లో పరీక్షల ఏర్పాట్లను డీఈవో వెంకటేశ్వర చారి, పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు పరిశీలించి సూచనలు చేశారు. భద్రాద్రి జిల్లాలో ఎంపిక చేసిన 73 పరీక్ష కేంద్రాలను 57 ప్రభుత్వ, 16 ప్రైవేట్ స్కూల్స్‌లో ఏర్పాటుచేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనుండటంతో పరీక్ష కేంద్రాల్లోని పాఠశాలల్లో వివిధ తరగతులను మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఒంటిపూట తరగతులను నిర్వహిస్తూ, ఇప్పుడు పదో తరగతి పరీక్షల కారణంతో నడిఎండలో తరగతులకు రావాలని ఆదేశాలు జారీచేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తాగుబోతు కొడుకును కడతేర్చిన తల్లి

(5వ పేజీ తరువాయి)



రాజ్‌కుమార్ (ఫైల్)

ఇంటికి వచ్చాడు. దీంతో సహనం కోల్పోయిన దూడమ్మ.. కుమారుడి కాళ్లు చేతులు కట్టివేసింది. రాజ్‌కుమార్ మద్యం మత్తులో ఉండటంతో ఆమెను అడ్డుకోలేకపోయాడు. అనంతరం చీరను తెచ్చి రాజ్‌కుమార్ మెడ చుట్టూ బిగించి లాగింది. దీంతో రాజ్‌కుమార్ వెంటనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు. ఈ ఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలో సంచలనంగా మారింది.

నేటి నుంచి రెండు రాష్ట్రాల స్థాయి

పౌరాణిక నాటక పోటీలు



గత పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

మధిర రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక కళల పరిరక్షణే ధ్యేయంగా కళాకారులను ప్రోత్సహిస్తూ భావితరాలకు ప్రాచీన కళలను అందించే దిశగా మధిర మండలం మాటూరుపేట గ్రామానికి చెందిన శ్రీసీతారామాంజనేయ కళాపరిషత్ ముందుకు సాగుతుంది. దీనిలో భాగంగా మార్చి 21, 22, 23తేదీల్లో మధిరలోని వేంకటేశ్వరస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో సీతరామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలస్థాయి పౌరాణిక నాటక పోటీలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పాశ్చాత్య ఒరవడిలో పడి మరుగున పడిపోతున్న పౌరాణిక రంగ స్థల కళలను పరిరక్షించాలన్న తపనతో మధిర మండలం మాటూరుపేట గ్రామానికి చెందిన కళాకారుడు గడ్డం సుబ్బారావు ఒక పరిషత్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఏటా మధిరలో రెండు రాష్ట్రాల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా మార్చి 21నుంచి మూడురోజులపాటు మధిరలో మాటూరుపేట శ్రీసీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలస్థాయిలో పౌరాణిక నాటక పోటీలు నిర్వహించనున్నారు. కళాపరిషత్ అధ్యక్షుడైన సుబ్బారావు పద్యనాటకాన్ని జీవనం పోస్తూ కళాకారుడిగా రాణిస్తూ కళాపరిషత్‌ను ఏర్పాటు చేశాడు. తన తండ్రి గడ్డం సూర్యానారాయణ కూడా పౌరాణిక రంగస్థల కళాకారుడే. ప్రతి ఏటా రెండు రాష్ట్రాల స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నాడు.

పద్యనాటకాలను పరిరక్షించాలి

● గడ్డం సుబ్బారావు, కళాపరిషత్ అధ్యక్షుడు



సంప్రదాయ రంగస్థల పౌరాణిక పద్యనాటకానికి జీవం పోయాలనే తపనతోనే కళాపరిషత్‌ను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నాను. ఏటా పోటీలు నిర్వహించినట్లుగానే ఈ సంవత్సరం కూడా మధిరలో పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాము. కళల పరిరక్షణకు పాటుపడుతూ ముందుకు సాగుతున్నాం.

వసతులున్నా.. వైద్యులేరీ?

- అవస్థలు పడుతున్న రోగులు
- పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని వినతి

మణుగూరు టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మణుగూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సదుపాయాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. అరకొర వైద్య సిబ్బంది, నెలకొన్న అనేక సమస్యలు రోగులకు సజావుగా వైద్య సేవలందించలేక పోతున్నాయి. ఈ ఆస్పత్రిలో మొత్తం డాక్టర్లు 23 మంది ఉండాల్సి ఉండగా, వారిలో గైనకాలజిస్టులు ఐదుగురు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే కాంట్రాక్టు పద్ధతిలో ఇటీవల విధుల్లోకి చేరారు. మూడు గైనకాలజిస్టు డాక్టర్ల కొరత ఉంది. అనస్తీషియా విభాగంలో ముగ్గురు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో ఆపరేషన్లు స్థానికంగా చేసే అవకాశం లేదు. పిల్లల వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. రేడియాలజి ఉన్న ఒక్క పోస్టుకు భద్రాచలం నుంచి మణుగూరుకు డిప్యూటేషన్‌పై పంపారు. జనరల్ మెడిసిన్ ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. జనరల్ సర్జన్ విషయంలో కూడా ముగ్గురికి ఒక్కరు కూడా లేరు. ఆర్థోపెడిక్ రెండు పోస్టులు రెండూ ఖాళీగా ఉన్నాయి. ఈఎన్‌టీ, పెథాలజీ, డిప్యూటీ సీఎస్ ఆర్ ఎంవోలు ఒక్కొక్కరి చొప్పున సేవలందించాల్సి ఉండగా ఈ మూడింటిలో ఒక్కరు కూడా లేరు. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు రెండు పోస్టులకు ఇద్దరు పర్మినెంట్ వైద్యులు ఉండగా అదనంగా కాంట్రాక్టు పద్ధతిలో ముగ్గురిని జనరల్ డ్యూటీ సేవలందించేందుకు ఏర్పాటు చేశారు. డెంటల్ డాక్టర్ ఒకరు సేవలందిస్తున్నారు. ఫోరెన్సిక్ మెడిసన్ డాక్టర్ ఒక్కరు ఉండాల్సి ఉండగా ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది.

సిబ్బంది విషయానికి వస్తే 71 మంది పలు విభాగాల వైద్య సిబ్బంది పోస్టులకు గానూ కేవలం 36 మంది రెగ్యూలర్ సిబ్బంది, ఒకరు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. మిగిలినవన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆసుపత్రిలో ఉన్న అరకొర సిబ్బంది వైద్య సేవలపైనే ప్రజలు ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయాల నిధులను కేటాయించి భవనాన్ని సమకూర్చుకున్న ఈ ఆస్పత్రిలో సిబ్బంది కొరతతో వెలవెలబోతుంది.



ఏరియా ఆసుపత్రి

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించి ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగు పరిచేందుకు చర్యలను చేపట్టాలని ప్రజలు కొరుతున్నారు.

అధికారులకు నివేదిక పంపించాం

● సునీల్, సూపరింటెండెంట్

ఆసుపత్రిలో మొత్తం 98 మంది సిబ్బందికి 44 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 54 ఖాళీలు ఉన్నాయి. భర్తీ కోసం సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ఆస్పత్రిలో ప్రతి రోజు 300 నుంచి 400 మంది రోగులు వస్తున్నారని ఉన్న సిబ్బందితో వారికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం.

విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక సాయం

చుంచుపల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి): విదేశీ విద్య అభ్యసించే అర్హులైన ఎస్సీ విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్‌సిస్ విద్యాభివృద్ధిలో భాగంగా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు భద్రాద్రి షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి అనసూర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను విద్యానిధి పథకంలో భాగంగా పది దేశాలకు వెళ్లి తమ ఉన్నత విద్యను కొనసాగించేందుకు అవకాశం ఉందన్నారు.

అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ యూనైటెడ్ కింగ్‌డమ్, సింగపూర్, జపాన్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు వీటిలో ఉన్నాయని తెలిపారు. ఈ పథకంలో అర్హులైన విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకుండా ఉండాలని, పేర్కొన్నారు.

కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. డిగ్రీలో 60 శాతం మార్కులు ఉన్న వారే పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేందుకు విదేశాలకు వెళేందుకు అర్హులని తెలిపారు. అదేవిధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు ఉన్న వారే పీహెచ్‌డీ కోసం అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మే 19వ తేదీ ఆఖరు తేదీ అని వివరించారు. ఇతర వివరాలకు జిల్లా ఐడీవోసీలోని షెడ్యూల్డ్ కులం అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించాలని కోరారు.

కమిషనర్‌ను అంటూ కాల్..

రూ.50వేలు స్వాహా

సత్తుపల్లిరూరల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్‌ను అంటూ పలువురి నుంచి రూ.50 వేలు స్వాహా చేసిన సంఘటన సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. 9911468329, 7670906441, 7989272438 నంబర్ల నుంచి కాల్ చేసి తాను మునిసిపల్ కమిషనర్‌ను, మీ షాప్ లైసెన్స్ పూర్తయిందని, వెంటనే ఫెనాల్టీ లేకుండా చెల్లించాలంటూ సుమారు రూ.50వేల వరకు ఫోన్‌పే నంబర్ చెబుతూ పలువురు వ్యాపారుల వద్ద రూ.50వేల వరకు కాజేసినట్లుగా బాధితులు లబోదిబోమంటున్నారు.

అయితే ఇదే విషయమై సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ నర్సింహ స్పందిస్తూ ఎటువంటి నంబర్ల నుంచి గానీ, అజ్ఞాత వ్యక్తులు గానీ లైసెన్స్ చెల్లించాలని, ఎలాంటి కాల్స్, వాయిస్ మెసేజ్‌లుగానీ, ఫోన్‌పే చేయాలని కోరితే వెంటనే తమకు గానీ, పోలీసులకుగానీ తెలియజేయాలని కోరారు. అదేవిధంగా మునిసిపాలిటీ వార్డ్ ఆఫీసర్ ప్రత్యక్షంగా షాప్ వద్దకు వచ్చినప్పుడే ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకుని రశీదు పొందాలని, లేకుంటే కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

పుణ్యపురం మేజర్ కాల్వకు గండి

కల్లూరు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చవరం గ్రామ సమీపంలో గల పుణ్యపురం మేజర్ కాల్వపై 65 కిలోమీటర్ వద్ద గురువారం గండిపడింది. కల్లూరు జలవనరులశాఖ ఈఈ ఎం. లక్ష్మీనారాయణ, డీఈఈ రత్నాకర్‌లు గం డిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇప్పటికే యజ్ఞనారాయణపురం, లక్ష్మీపురం కేశవపురం గ్రామాల్లో వందల ఎకరాలకు పంటకు నీరు అందక పంట నష్టం జరిగిందన్నారు. రైతుల కోరిక మేరకు ప్రస్తుత దశలో వారబందీ ద్వారా ఎక్కువ మొ తాదులో సాగునీరు ఆయకట్టుకు విడుదల చేయడంతో కాల్వ సామార్థ్యానికి మించి నీటిప్రవాహం పెరిగిందని రైతులు తెలిపారు. పుణ్యపురం కాల్వ ద్వారా సక్రమంగా సాగునీరు అం దించి వరి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

గండిపూడ్చివేత...

పుణ్యపురం మేజర్ కాల్వపై గండి పడగా వెంటనే స్పందించిన అధికారులు యుద్ధప్రాతిపదికపై గండిపూడ్చివేశారు. సదరు కాల్వ కట్టపై 3 కిలోమీటర్ వరకు వెడల్పుతో గండి పడిన సమాచారంతో అధికారులు స్పందించారు. పుణ్యపురు కాల్వపై 0కిలోమీటర్ రెగ్యూలేటర్ వద్ద లాకులను దించి నీటి సరఫరాను నిలిపివేసి గండిని పూడ్చి వేశారు. తిరిగి కాల ద్వారా 80 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. క్రమేణ కాల్వ ద్వారా సాగునీటి సామర్థ్యం పెంచనున్నట్లు అధికారులు తెలిపారు.



పుణ్యపురం మేజర్ కాల్వపై గండి పడిన దృశ్యం

హైదరాబాద్‌కు తరలివెళ్లిన కారుణ్య అభ్యర్థులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖలో కారుణ్యనియామకాలకు ఎంపికైన 27 మంది అభ్యర్థులు గురువారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు.. ఈ నేపథ్యంలో ప్రత్యేక బస్సు ద్వారా జిల్లా పరిషత్ నుంచి తరలివెళ్లారు. ఈ బస్సును డిప్యూటీ సీఈవో నాగ పద్మజ ప్రారంభించారు. కారుణ్యనియామకాల కోసం కొన్నేళ్లుగా నిరీక్షిస్తున్న నిరుద్యోగుల కల నేడు సాకారం కానుంది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి వచ్చే జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జడ్పీ మండల పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బందిలో ఎవరైనా అనారోగ్య కారణాలతో చనిపోతే వారి కుటుంబీకులకు ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 27 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపిక చేశారు. వారందరికీ గురువారం హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు పత్రాలను అందించారు. దీనికోసం ఎంపికైన అభ్యర్థులను ప్రత్యేక బస్సు ద్వారా జిల్లా పరిషత్ అధికారులు హైదరాబాద్ తీసుకెళ్లారు.



కారుణ్యనియామకపు పత్రాలను అందుకునేందుకు హైదరాబాద్ తరలివెళ్తున్న అభ్యర్థులు

జమలాపురం ఆలయ హుండీ ఆదాయం రూ.32లక్షలు



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలలోని జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆల యం కానుకల హుండీని ఆలయ అధికారుల సమక్షంలో గురువాం సిబ్బంది లెక్కించారు. ఖమ్మంకమాన్‌బజార్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో కె.వేణుగోపాలచార్యులు పర్యవేక్షణలో భక్తులు శ్రీవారికి సమర్పించిన కానుకలు, ముడుపులు 91రోజులకుగాను రూ.32,86,315లు వచ్చినట్టు ఆలయ ఈవో కె.జగన్మోహన్‌రావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయ కుమారి, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు రాజీవ్‌శర్మ, శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

తాకట్టు పెట్టిన బంగారం మాయం

మధిరటౌన్,మార్చి20(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని వినాయకుడి గుడి ప్రక్కన ఉన్న ఓప్రవేటు గోల్డ్‌ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన బంగారాన్ని అందులో పని చేసే ఉద్యోగి స్వాహా చేశాడు. మధిర మునిసిపాలిటి పరిధిలోని జిలుగుమాడు గ్రామానికి చెందిన వ్యక్తి 2022లో 19.32 గ్రాముల బంగారు చైనును గోల్డ్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.60వేలు తీసుకున్నాడు. ఈనెల 5న బాధితుడు లోన్‌రెన్యువల్ చేసుకునేందుకు వచ్చాడు. అప్పటి మేనేజర్ బంగారాన్ని రిలీజ్ చేసినట్లు రికార్డుల్లో ఉందని ప్రస్తుత సిబ్బంది తెలిపారు. గోల్డ్ మాయం అయిన విషయాన్ని గోప్యంగా ఉంచి కొందరు సెటిల్ చేస్తున్నట్లు తెలుస్తుంది.

చంచల్‌గూడ జైల్లో భద్రాద్రి వాసి మృతి

స్థానిక అధికారులకు సమాచారం అందించిన జైలు అధికారులు

భద్రాచలం, మార్చి20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చంచలగూడలో శిక్ష అనుభవిస్తున్న భద్రాచలంలోని అశోకనగర్ కాలనీకి చెందిన ధనసరి మల్లేష్ అలియాస్ పొడియం మల్లేష్(47) గురువారం మృతి చెందాడు. గంజాయి కేసులో నిందితుడికి శిక్షపడింది. దీంతో గత ఏడాది డిసెంబర్లో ఖమ్మం నుంచి చంచలగూడ కర్మాగారానికి తరలించారు. అనారోగ్య సమస్యలతో ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యాధికారులు కారాగారం అధికారులకు సమాచారం అందంచారు. వాస్తవానికి ధనసరి మల్లేష్ ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా కలిమెల మండలం కురునూరు పంచాయతీలోని కుప్పతొట్టి గ్రామానికి చెందిన వారని అధికారులు పేర్కొంటున్నారు. కొంత కాలంగా వీరు భద్రాచలంలోని అశోకనగర్ కాలనీలో ఉంటున్నారు. దీంతో సమాచారాన్ని భద్రాచలం ప్రత్యేక సబ్‌జైలుకు అధికారులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రయత్నించారు. కాగా 48 గంటల్లోపు ఎవరు రాకపోతే మృతదేహాన్ని మునిసిపాలిటీ వారికి అంత్యక్రియల నిమిత్తం అందజేస్తామని చంచలగూడ కేంద్రకాగారం అధికారులు ప్రకటన జారీ చేశారు.



మల్లేష్(ఫైల్)

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం, మార్చి20(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మండలంలో జరిగింది. మండలలోని పడమటితండాకు చెందిన బానోతు శ్రీను(36) వ్యవసాయకూలీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. శ్రీనుకు మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం సూర్యతండాకు చెందిన ఓమహిళతో వివాహం అయింది. అతడికి ఇద్దరు పిల్లలున్నారు. కూలిపని చేస్తూ సూర్యతండాలో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. దీంతో నిత్యం కుటుంబ సభ్యులు మధ్య ఘర్షణ జరుగుతుండేది. ఈనేపథ్యంలో గురువారం ఉదయం పడమటితండా బయలుదేరి గ్రామసమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని సమీప రైతులు గమనించి అతన్ని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఘటన స్థలాన్ని ఎస్ఐ కూసుపుడి జగదీష్ సందర్శించి వివరాలు సేకరించారు. కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతా గోప్యమే

- భద్రాద్రి దేవస్థానంలో అదనపు కమిషనర్ కృష్ణవేణి విచారణ
- ఈవో, అర్చకుల మధ్య వివాదంపై వివరాల సేకరణ

భద్రాచలం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈవో, అర్చకులతో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి సమావేశమయ్యారు. హైదరాబాద్ నుంచి గురువారం వచ్చిన ఆమె రంగనాయకుల గుట్టపై ఉన్న ఓ కాటేజీలో దేవస్థానం ఈవోతో పాటు ప్రధాన అర్చకుడు, ఇతర వైదిక సిబ్బందితో విచారణ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇటీవల దేవస్థానంలో ఉప ప్రధాన అర్చకుడిగా పని చేస్తున్న అమరవాది శ్రీనివాస రామానుజం విధుల్లో వ్యవహరించిన తీరుపై తీవ్రవిమర్శలు వచ్చాయి. దీంతో శాఖపరంగా ఆయన్ను భద్రాచలం రామాలయం నుంచి పర్ణశాల రామాలయంలో విధులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలో ఈనెల 13న దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డోలోత్సవం, వసంతోత్సవాల అంకురార్పణకు వైదిక బ్రహ్మగా ఉన్న శ్రీనివాస రామానుజాన్ని అనుమతించాలని కోరుతూ ఈవోను ప్రధాన అర్చకుడు, వైదికసిబ్బంది కోరిన క్రమంలో వివాదం చోటు చేసుకుంది. ఈనేపథ్యంలో అంకురార్పణ ఆలస్యమైంది.ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో దేవాదాయశాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ ఆదేశాల క్రమంలో దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి గురువారం ఈవో, వైదిక సిబ్బంది నుంచి వివరాలు సేకరించినట్లు సమాచారం. అదనపు కమిషనర్ కృష్ణవేణి విచారణ మొత్తం పూర్తి గోప్యంగా సాగింది. మీడియాకు ఈ విషయంపై ఎటువంటి సమాచారం అధికారికంగా అధికారులు వెల్లడించలేదు. ఈ నివేదికను కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలుస్తోంది.



విచారణ అనంతరం బయటకు వస్తున్న వైదిక సిబ్బంది

ఉలిక్కి పడ్డ రవాణాశాఖ

ఏసీబీ దాడుల ప్రచారంతో ఆన్‌లైన్ కేంద్రాల మూత

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా రవాణాశాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కార్యాలయంలోని అధికారులతో పాటుగా సమీపంలో ఉన్న ఆన్‌లైన్ సేవా కేంద్రాలకు తాళాలు పడ్డాయి. గురువారం ఖమ్మం రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరుగుతాయని ఓ ప్రచారం జరిగింది. దీంతో రవాణాశాఖ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులను కార్యాలయంలోకి అనుమతించలేదు. ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. మధ్యాహ్నం 12గంటలకే ఆన్‌లైన్ సేవా కేంద్రాలు సైతం మూతపడ్డాయి. రవాణాశాఖ అధికారులు మాత్రం సాయంత్రం 5గంటల వరకు కార్యాలయంలో ఉండి వెళ్లారు.



మూతపడిన ఆన్‌లైన్ సేవా కేంద్రాలు

ఆత్మహత్యాయత్నం

పెనుబల్లి,మార్చి20(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై తిరుగుతున్న ఓ వ్యక్తి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పెనుబల్లి మండలం ఉప్పలచిలకలో చోటుచేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బలరాం సంచారజీవిగా జాతీయ రహదారిపై తిరుగుతూ ఉప్పలచిలక గ్రామానికి చేరుకున్నాడు. రెండురోజులుగా ఓగుడిలోనే ఉంటున్నాడు. బుధవారంరాత్రి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రికి తరలించారు. మానసికస్థితి సరిగా లేకనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెనుబల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తగూడెం గ్రామశివారు చెరువు గట్టుపై కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో వీఎంబంజర్ ఎస్ఐ వెంకటేష్ తనిఖీలు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మిగతావారు పరారయ్యారు. వీరినుంచి రూ.3300నగదు, మూడు ద్విచక్రవాహనాలు, టాటాఏస్ వాహనం స్వాధీనం చేసుకున్నారు.

300 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఖమ్మంకలెక్టరేట్,మార్చి20(ఆంధ్రజ్యోతి):ఖమ్మంలోని అల్లీపురం సమీపంలో వెంచర్‌లో గురువారం తెల్లవారు జామున రాష్ట్ర సివిల్‌సప్లై టాస్క్‌ఫోర్స్ బృందం ఓఎస్డీ అంజయ్య, ఏసీపీ యాదయ్య,ఎంఆర్‌వో కమిల్‌పాషా,ఎస్ఐ స్వామిదాస్ ఆధ్వర్యంలో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే లారీలో బియ్యం లోడ్ చేసి ఉంచారు. నిఘా వేసి అక్కడే ఉండగా రెండు ఆటోలో బియ్యాన్ని తీసుకొచ్చారు. దానికి ముందు ఎస్కార్ట్‌గా కార్ రావడంతో అక్రమార్కుల గుట్టురట్టు అయ్యింది. సుమారు 300 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

నాగుపల్లిలో కార్డన్ చర్చ్

32 ద్విచక్రవాహనాల స్వాధీనం

దమ్మపేట, మార్చి20(ఆంధ్రజ్యోతి): యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలో నాగుపల్లిలో ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం కార్డన్‌చర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని 32 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో 6నెలల జైలు

ఖమ్మంలీగల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని చావా రమయ్యనగర్ ప్రాంతానికి చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితుడైనఎం.డీ.యహియాఖాన్ అబ్దుల్‌కి 6నెలలు జైలుశిక్షతోపాటు రూ.7లక్షలు నష్టపరిహారం కింద ఫిర్యాదికి చెల్లించాలని ఖమ్మంమొదటి అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని గురువారం తీర్పుచెప్పారు. ఖమ్మం నగరం బాలపేటకు చెందిన ఫిర్యాది వడ్లమూడి నాగేశ్వరరావు వద్ద నిందితుడు కుటుంబ అవసరాల నిమిత్తం 2018న రూ.4.50లక్షలు అప్పుగా తీసుకొని ఫిర్యాదికి ప్రాంసరీనోటు రాసి ఇచ్చినాడు. రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు 2020న రూ.7లక్షలకు చెక్కును జారీ చేసినాడు. ఈ చెక్కు బ్యాంకులో తిరస్కరణకు గురైనది. ఫిర్యాది కోర్టులో కేసు దాఖలు చేశాడు. ఈ కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కొణిజర్లలో ఆసుపత్రి సీజ్

కొణిజర్ల,మార్చి20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొణిజర్లలో ఓ ప్రైవేటు వైద్యశాలను గురువారం సీజ్ చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి గురువారం సాయిరాం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ ఆసుపత్రిపై ఆరోపణలు వచ్చాయని, తనిఖీ చేయగా ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. హాస్పటల్‌తో మెడికల్‌షాపును కూడా సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా హాస్పటల్‌ను నడిపించటం పట్ల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రవేటు ఆసుపత్రి సీజ్ చేసిన అనంతరం కొణిజర్లలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో అందుతున్న సేవలపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల రికార్డులను, ఓపీ వివరాలను తనిఖీ చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఆమెతో పాటు డిప్యూటీ వైద్యధికారి సైదులు, జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ, సాంబశివరెడ్డి, స్థానిక వైద్యాధికారిని శారద పాల్గొన్నారు.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి కళావతిబాయి



ఏదులాపురం మునిసిపాలిటీలో ధ్రువపత్రాల జారీ

ఖమ్మంరూరల్,మార్చి20(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీలో రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జనన, మరణ ధ్రువపత్రాలు అన్నింటికీ మోక్షం లభించింది. గురువారం పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలన్నింటినీ అప్రూవల్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇంకా ఎవరికైనా జనన, మరణ ధ్రువపత్రాలు అవసరమైన వారు వెంటనే పెద్దతండాలోని కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇంటిపన్నులు, అస్సెస్మెంట్స్, మ్యూటేషన్స్ ట్రేడ్ లైసెన్స్, హౌస్ పర్మిషన్స్, ఇతర పౌరసేవలు సోమవారం నాటికి పూర్తిగా అందుబాటులోకి వస్తాయని ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి

సీపీఎం తిరుమలాయపాలెం మండల కార్యదర్శి శ్రీను

తిరుమలాయపాలెం,మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్ తండా శివారు గోపాయిగూడెంలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. గురువారం మండలంలోని గోపాయిగూడెంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గోపాయిగూడెంలో రేషన్‌షాపు లేకపోవడంతో జింకలగూడెం వెళ్లి ప్రజలు రేషన్ తెచ్చుకుంటున్నారని తెలిపారు. అర్హులైన పేదలకురేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నారు ఈనెల 24న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దాసరి మహేందర్, టి.నాగేశ్వరరావు, కె.రమేష్, నాగలక్ష్మి, రమ, కొండ పద్మ పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి



ఖమ్మంకలెక్టరేట్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావును కలిశారు. డీఎంఈ పరిధిలోకి 104 ఉద్యోగులను సర్దుబాటు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఉన్నఖాళీ పోస్టుల వివరాలను అందించాలని కోరారు. భవిష్యత్తులో జరిగే డీఈవో నియామకాల్లో 104లో 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో భర్తీ చేయాలని ఆయనను కోరారు. అనంతరం జిల్లా ఖజానాశాఖ డీడీని కలిసి ఖజానా శాఖలో ఉద్యోగుల పనిభారం శాఖల విభజన చేయాలంటూ పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు.

విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు యశ్వంత్

ఖమ్మంరూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని తక్షణమే బడ్జెట్ కేటాయింపులకి సవరణ చేసి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు యశ్వంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పీడీఎస్‌యూ రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో గురువారం జిల్లా మంత్రుల దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, వెంకటేష్, సిద్ధు, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని యూపీహెచ్ కాలనీలో ప్రభుత్వ భవనంలో ఉన్న ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం శిక్షణ కలెక్టర్ మిృణాల్ శ్రేష్ఠతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రంలో వాల్‌పెయింట్, చిన్నారులను ఆకట్టుకునే చిత్రాలతో సుందరీకరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్ సునీత పాల్గొన్నారు.

అన్నప్రాసన వేడుకలో మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని మండ్రాజుపల్లి కొత్తూరులో గురువారం జరిగిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు నెల్లూరి భద్రయ్య మనుమడు విరాజ్‌నందన్ అన్నప్రాసన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. చిన్నారి విరాజ్‌నందన్‌ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, వివిధ పార్టీలకు చెందిన సూరపనేని రామకృష్ణ, తలశీల గోపాలరావు, ఆరెకట్ల కొండలరావు,షైసా శంకర్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, బచ్చలకూరి నాగరాజు, ఆరెకట్ల గురునాధం, దోసపాటి చంద్రశేఖర్, సీతారాములు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల దృష్ట్యా ఆర్టీసీ విధి నిర్వహణలో ఉన్న కండక్టర్లకు, డ్రైవర్లకు గురువారం నుంచి చల్లటి మజ్జిగ ప్యాకెట్లు అందిచటం జరుగుతుందని ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. నగరంలోని నూతన బస్టాండ్, సిటిబస్టాండ్‌లో విధుల్లో ఉన్న డ్రైవర్లకు, కండక్టర్లకు మజ్జిక ప్యాకెట్లను అందించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

తిరుమలాయపాలెం, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు,పెన్నులను గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులున్నాయని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నూకల అబినవ్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, రాందాస్, బాలరాజు, సురేష్, సీతారానాయక్, పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

నేలకొండపల్లి, మార్చి20 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం నేలకొండపల్లి వచ్చిన కోటేశ్వరరావు పార్టీ రాష్ట్ర నాయకుడు భవనాశి దుర్గారావు ఇంట్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకే జాతి...ఒకే ఎన్నికపై ప్రజలకు అవగాహన కలిగించటానికి సదస్సులు నిర్వహించాలన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక ఎనికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకుని జిల్లాలో పార్టీ సత్తాను చాటాలన్నారు. జిల్లా కమిటీలో మండలానికి తగు ప్రాధాన్యం ఇవ్వాలని మండల నాయకులు జిల్లా అధ్యక్షుని కోరారు. తొలుత మండ్రాజుపల్లి కొత్తూరులో జరిగిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు నెల్లూరి భద్రయ్య మనుమడి అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు భవనాశి దుర్గారావు, జిల్లా నాయకుడు మన్నె కృష్ణయాదవ్, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, తోగటి నాగాచారి, కందరబోయిన వెంకటరమణ, ఇస్లావత్ నాగేశ్వరరావు, ఎలిగేటి గిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

నగరంలో రోడ్లు అధ్వానం

నగరంలోని పలు సెంటర్లలో ప్రధాన రహదారులు నరకప్రాయంగా మారాయి. గుంతలుపడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మయూరిసెంటర్, కొత్తబస్టాండ్, వినోదా థియేటర్ రోడ్డు, ఆర్డీవో కార్యాలయం, లెనిన్‌నగర్ తదితర ప్రాంతాలలో రోడ్లు సగం కోతకుగురై తీవ్ర అసౌకర్యంగా ఉన్నాయి పైపులైన్ల కోసం తవ్విన రోడ్డును పూడ్చకుండా వదిలేయడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి.

: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఖమ్మం



కొత్తబస్టాండ్ సమీపంలో





కొత్తబస్టాండ్ సమీపంలో



వినోద థియేటర్ వద్ద..



ఆర్డీవో ఆఫీసు రోడ్డు..



లెనిన్ నగర్‌లో..

యాసంగి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్,మార్చి20(ఆంధ్రజ్యోతి): యాసంగిలో ధాన్యం కొనుగోళ్లకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి యాసంగి ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత అంచనా ప్రకారం యాసంగిలో లక్ష 85 వేల మెట్రిక్‌టన్నుల సన్న రకం ధాన్యం, 73వేల మెట్రిక్‌టన్నుల దొడ్డురకం ధాన్యం, మొత్తం 2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గతంలో ధాన్యం రవాణా అంశంలో ఎక్కడైనా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వాటిని పునరావృతం కాకుండా చూడాలన్నారు. జిల్లాలో మొత్తం 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు అనుకూలంగా



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో అవసరమైన చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం వడ్లు రాకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి. పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ. అలీం, జిల్లా సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ ఆఫ్‌కైండ్‌నెస్‌ను ప్రారంభించిన కలెక్టర్

జిల్లా ప్రధాన ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన వాల్ ఆఫ్‌కైండ్‌నెస్ గోడను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం రాత్రి ప్రారంభించారు. ప్రజలు తమ ఇంట్లో అవసరంలేని వస్తువులు, పాతసామాన్లు, బట్టలు ఇక్కడ ఉంచి వెళితే అవి అవసరం ఉన్నవారు తీసుకొని వినియోగించుకుంటారని తెలిపారు. శుభ్రంగా ఉపయోగించదగిన,పాడైపోని దుస్తులు,బూట్లు, పుస్తకాలు, పాత్రలు, ఏదైనా ఇతర వస్తువులను వదిలి వేయాలని అన్నారు. ఆహార పదార్థాలు వదిలివేయొద్దని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ జెడ్పీసీఈఓ దీక్ష రైనా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కేయూ ఫలితాల్లో ప్రియదర్శిని విద్యార్థుల ప్రతిభ



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన 1, 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు.9మంది విద్యార్థులు 9జీపీఏకి పైగా, 112మంది 8జీపీఏకుపైగా సాధించారని తెలిపారు.మంగళవారం కళాశాలలో వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామారావు, అకాడమిక్ డైరెక్టర్ శివకుమార్‌పాల్గొన్నారు.

భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు జరపాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. గురువారం ఖమ్మం నగరంలో కమిషనర్ పర్యటించారు. 46వ డివిజన్‌లో నూతన నిర్మాణాలు, పారిశుధ్య పనులను తనిఖీలు చేశారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక కార్పొరేటర్లు, ప్రజలతో కేఎంసీ ఉద్యోగులు మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. 8వ డివిజన్‌లోని నర్సరీలను పరిశీలించారు. వాక్వేలో వెలగని వీధి దీపాలను మార్చాలని ఆదేశించారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, తడి,పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వెర్వేరుగా అందించే విదంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు.



46వ డివిజన్‌లో పారిశుధ్యంపై సూచనలు ఇస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

న్యాయవాద సంఘం ఎన్నికలకు ..

ముగిసిన నామినేషన్ల పర్వం

ఖమ్మంలీగల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న జిల్లా బార్‌అసోసియేషన్ (న్యాయవాదసంఘం) ఎన్నికల నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. అధ్యక్ష స్థానానికి ముగ్గురు అభ్యర్థులు తొండపు వెంకటేశ్వరరావు, సుగ్గల వెంకటేశ్వర్‌గుప్తా, అయ్యదేవర విజయరాఘవ నామినేషన్ వేశారు., ప్రధాన కార్యదర్శి స్థానానికి తెల్లాకుల రమేష్ బాబు, గద్దల దిలీప్, ఉపాధ్యక్ష పదవికి ఎస్‌కే జానీమియా, జింజిరాల విజయశాంత, మల్లెం రవిప్రసాద్, సంయుక్త కార్యదర్శి పదవికి మేకల నవీన్ నామినేషన్ దాఖలు చేశారు. క్రీడాకార్యదర్శి పదవికి రాందాస్ నాయక్, కే.వి.వి.లక్ష్మీ, గ్రంథాలయ కార్యదర్శి పదవికి దేరంగుల కళ్యాణి, సింగారపు రాంబాబు, ట్రెజరర్ పదవికి పి.నరసింహారావు, మహిళా ప్రతినిధి పోరిక ఇందిర నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం తుది అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో 815 మంది న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. జాయింట్‌సెక్రటరీ, ట్రెజరర్, మహిళా ప్రతినిధి ఒక్కొక్కటే నామినేషన్ వచ్చింది. దీంతో వారి ఎన్నిక ఏకగ్రీవంగా ప్రకటించే అవకాశం ఉంది.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఖమ్మంరూరల్,మార్చి21(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలకు అధికారులు అన్నిఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం 6పరీక్ష కేంద్రాలు, 779 మంది విద్యార్థులు, 103మంది ఇన్విజిలేటర్స్ ఉన్నారు. పరీక్ష కేంద్రాలు జలగంనగర్, ఏదులాపురం, తల్లంపాడు, కారుణ్య భవన్, కేజీబీవీ, గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఆరోగ్య కార్యకర్తలు, తాగునీటి సౌకర్యం, రక్షణ సిబ్బందితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

తిరుమలాయపాలెం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు 13పాఠశాలలకు చెందిన 425మందికి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. సుబ్లేడు, పిండిప్రోలు, తిరుమలాయపాలెం, బీరోలు నాలుగుసెంటర్లు ఏర్పాటుచేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

పరీక్ష సామగ్రి అందజేత

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని బల్లేపల్లి ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు గురువారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై మేయర్ సమీక్ష

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. గురువారం మేయర్ ఛాంబర్‌లో ఇంజనీరింగ్, తాగునీటి నిర్వాహణ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. చేతి పంపులు, మిషన్ భగీరథ,ఇతర తాగునీటి పథకాల మరమ్మతులపై ఇంజనీరింగ్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. నీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాలకు వాటర్ ట్యాంకులను సమకూర్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ల సూచనలు తీసుకోవాలని, వారి సలహాలను పరిగణించాలన్నారు. డీఈ శ్రీనివాసరావు, ఏఈలు బాబు, కుమారస్వామి, తేజా పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం పరిశీలన

4వ డివిజన్ బాలాజీనగర్‌లో నిర్మాణం జరుగుతున్న పట్టణ ఆరోగ్య కేంద్రం పనులను మేయర్ పునుకొల్లు నీరజ తనిఖీ చేశారు. పనులు నాణ్యంగా ఉండాలని వైద్య సేవలకు అనుకూలంగా భవన నిర్మాణ పనులు జరపాలని ఆదేశించారు. 14వ డివిజన్ గొల్లగూడెంలోని నర్సరీని పరిశీలించారు. ఖమ్మం నగరంలోని ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు అందించేందుకు ఉద్యాన అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందు కోసం 1లక్ష మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు.



మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖమ్మంరూరల్,మార్చి20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతను సాధించిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు మాదిగ మాట్లాడుతూ ఈవిజయాన్ని ఉద్యమ పోరాటంలో మాదిగ అమరవీరులకు అంకితమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొందయ్య, దాస్ మహరాజ్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమమేధ పాఠశాలలకు కంప్యూటర్లు, ఇన్వర్టర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కృత్రిమ మేధ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన ఏడు ప్రాథమిక పాఠశాలలకు మంగళవారం కంప్యూటర్లు, ఇన్వర్టర్లు, ఇతర పరికరాలను అందించామని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్‌లు తెలిపారు. ఆధునిక కంప్యూటర్లు, కరెంట్ కోత లేకుండా ఇన్వర్టర్లు, వైఫై కనక్షన్ తోపాటు ఇతర అవసరమైన సామగ్రి అందుబాటులోకి రావటంతో పూర్తి స్థాయి కంప్యూటర్ ల్యాబ్‌ను సమకూర్చటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కృత్రిమ మేధా ద్వారా సాధన చేసిన విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించారు. ఎన్ఎస్ఈ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు పాండురంగాపురం, మల్లెమడుగు, సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి, సిద్దారం, ఎన్టీఆర్‌నగర్ సత్తుపల్లికి అందజేశారు. ఏడు పాఠశాలలో చదువులో వెనుకబడిన 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను 10 మందిని గుర్తించి కృత్రిమేధా ద్వారా తెలుగు, గణితాలను గతనెల 24వ తేదీ నుంచి సాధన చేయిస్తున్నారు.



బాధితులకు మంత్రి పొంగులేటి పరామర్శ



అనసూర్యమ్మను పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో పరామర్శలు చేశారు. రంగారావు బంజర్‌లో కాంగ్రెస్ నాయకుడు సోమరాజు సీతారామారావు తల్లి ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఆమెను మంత్రి పొంగులేటి పరామర్శించారు. అతడి సోదరుడు ప్రసాదరావు, రమాదేవి కుమార్తె లక్ష్మీసౌజన్య, సాయిశ్రీనివాస్‌లకు ఇటీవల వివాహం కాగా వారిని పొంగులేటి ఆశీర్వదించారు. టేకులపల్లి గ్రామంలో అనారోగ్యానికి గురైన పలువురిని మంత్రి పొంగులేటి పరామర్శించారు. టేకులపల్లిలో ఇండియన్ ఆయిల్ బంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కల్లూరు ఏఎంసీ చైర్‌పర్సన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మాలతికి నివాళి

తల్లాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లుపాడు మాజీ ఎంపీటీసీ మాలతీకి పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. గురువారం మాలతి దశదిన కర్మకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గోవిందు శ్రీను, జోసఫ్, కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కిషోర్, రాయల రాము తదితరులు హాజరై నివాళులర్పించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తల్లాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినపాక గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ ఉంద్రు వరలక్ష్మి సహకారంతో ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, డీసీ వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, తోట శ్రీనివాసరావు, హెచ్ఎం నర్సింహారావు, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కొణిజర్ల, మార్చి20(ఆంధ్రజ్యోతి): అన్ని దానాలకంటే రక్తదానం మహాదానం అని విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య అన్నారు. గురువారం స్థానిక విజయ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 120 మంది విద్యార్థులు రక్తదానాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సందీప్, జోష్నా, సిబ్బంది దినేష్, రహీమ్, వైస్ ప్రిన్సిపాల్ అయేషాతరుణం పాల్గొన్నారు.

రైతుసంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామారావు



బోనకల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతు సంఘ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన జక్కుల రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ రైతుసంఘ మహాసభలో తనను ఎన్నిక చేసినందుకు గానూ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. యంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, తోట రామాంజనేయులు, ఆకేన పవన్‌లు అభినందనలు తెలిపారు.

మిషన్ భగీరథ నిర్వహణపై సమీక్ష

తల్లాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా సక్రమంగా తాగునీరందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సురేష్ ఆదేశించారు. గురువారం మండలంలోని కుర్నవల్లి గ్రామంలో మిషన్ భగీరథపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపులైన్ల ద్వారా తాగునీరు వృథా కాకుండా లీకేజీలకు మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ ఇందు తదితరులున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

» రెండేళ్లుగా అవస్థలు పడుతున్న ప్రజలు » పట్టించుకోని అధికారులు » మరమ్మతు పనులు పూర్తి చేయాలని వినతి



కంకర తేలిన ముద్దునూరు-రంగాపురం రహదారి

తల్లాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం ముద్దునూరు నుంచి రంగాపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ తారు రోడ్డు మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతుంది. తారు రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా దెబ్బతిన్న రోడ్డుపైన తారును పూర్తిగా తొలగించడంతో కంకర మొనతేలింది. గోతులు ఏర్పడి ఈ రోడ్డుపై వెళ్లే వివిధ గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. 2022వ సంవత్సరంలో ముద్దునూరు నుంచి రంగాపురం వరకు సుమారు 1.5కిలోమీటర్ల మేరకు ఆర్‌అండ్‌బీ తారు రోడ్డు మరమ్మతులకు రూ.60లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు సంబంధిత కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టి దెబ్బతిన్న బీటీ రోడ్డుపై తారును పూర్తిగా తొలగించి కొత్తగా కంకర వేశారు. ఈ మరమ్మతు పనుల కోసం మొదటి విడతగా 2023 మార్చినెలలో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.40లక్షల మేరకు బిల్లు చేశారు. రెండేళ్ల అవుతున్నప్పటికీ కాంట్రాక్టర్‌కు రూ.40లక్షల బిల్లులు రాకపోవడంతో రోడ్డు మరమ్మతు పనులను మధ్యలోనే అసంపూర్తిగా నిలిపివేశారు. రెండేళ్లుగా బీటీ రోడ్డు మరమ్మతు పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో మరమ్మతుల కోసం వేసిన కంకర కూడా మొనతేలి రోడ్డుపై అక్కడక్కడ గుంతలేర్పడ్డాయి. ఈ రహదారి గుండా ముద్దునూరు నుంచి రంగాపురం, కలకొడిమ, బస్వాపురం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మరమ్మతు పనులు పూర్తిచేయాలి

● రావూరి రవిప్రసాద్, రంగాపురం



ముద్దునూరు-రంగాపురం బీటీ రోడ్డు మరమ్మతు పనులు అసంపూర్తిగా నిల్చిపోయాయి. దీంతో కలకొడిమ, బస్వాపురం, రంగాపురం గ్రామాల ప్రజలు ముద్దునూరు మీదుగా మండల కేంద్రమైన తల్లాడ రావడానికి నిత్యం నరకయాతన పడుతున్నాం. అసంపూర్తిగా బీటీ రోడ్డు మరమ్మతు పనులు నిలిచిపోయిన విషయం ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు స్పందించి బీటీ రోడ్డు మరమ్మతు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

ఎర్రుపాలెం మార్చి20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం చరిత్రాత్మకమని దేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్‌పార్టీ మధిర నియోజకవర్గ నాయకుడు బొబ్బిళ్లపాటి బాబురావు అన్నారు. మండలంలోని రామన్నపాలెం గ్రామంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ బిల్లు ఆమోదం పొందడంలో రాహుల్ గాంధీ పాత్ర చాలా గొప్పదన్నారు. దళిత జాతి ఇందిర కుటుంబానికి , కాంగ్రెస్‌పార్టీకి రుణపడి ఉందన్నారు. ఎస్సీవర్గీకరణ బిల్లుకు అన్ని రాజకీయపార్టీల ఎమ్మెల్యేలు మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. వర్గీకరణకోసం 30 ఏళ్లగా మాదిగలు, మాదిగ ఉపకులాలు పోరాటం చేస్తూ అనేక కుటుంబాలు ప్రాణత్యాగానికి వెనుకాడలేదని గుర్తుచేశారు. ఎస్సీవర్గీకరణ బిల్లు ఆమోదం పొందేలా అహర్నిశలు కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంఆర్‌పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో వేల్పుల వెంకటేశ్వర్లు, బొబ్బిళ్లపాటి శ్యామ్, సుధీర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధిర 'బార్' ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న కృష్ణారావు

మధిరటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): మధిర బార్ అసోసియేషన్‌కు ఈ నెల 27న జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. ఒక్క అధ్యక్ష స్థానానికి మినహా మిగతా అన్ని స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు చేశారు. అధ్యక్ష స్థానానికి ప్రస్తుత అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావుతో పాటు పల్లపోతుల కృష్ణారావులు పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా గంధం శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా రమణారావు, కోశాధికారిగా విజయకుమార్‌లు ఒక్కరే నామినేషన్లు వేయడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెల్లూరి వెంకట్రావు తెలిపారు. అధ్యక్ష స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని వెల్లడించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెనుబల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ స్వశక్తితో ఆర్థికంగా నిలదొక్కోవాలని అప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని మండాలపాడులో మహిళాశక్తి పథకం ద్వారా మంజూరైన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళలకు నాలుగువేల యూనిట్లను మంజూరు చేసి దుకాణాలను ఏర్పాటుచేశామని వారంతా స్వయం ఉపాధితో దుకాణాలు నడుపుతున్నారని తెలిపారు. అనంతరం పెనుబల్లి మండల సమాఖ్య కార్యాలయంలో మహిళలకు రుణాల మంజూరిపై పెనుబల్లి, వేంసూరు, కల్లూరు కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, ఏపీఎం జ్యోతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణకుమారి, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు మండలాల కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం



కారేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వైరా, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ కేటాయింపులు చేయటాన్ని, ఖమ్మంజిల్లాకు యూనివర్సిటీ ప్రతిపాదనను విస్మరించటాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం వైరాలో ఆందోళన నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పీడీఎస్‌యూ నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, మల్సూర్, స్పందన, అఖిల, నందిని, శైలజా, వెంకటేష్ పాల్గొన్నారు.



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కారేపల్లిలో...

కారేపల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు స్టాలిన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లోనే విద్యారంగానికి కేవలం రూ.23,108 కోట్లు అంటే 7.57 శాతం మాత్రమే నిధులు కేటాయించి విద్యారంగాన్ని నిరాశపరిచిందన్నారు. ఈకార్యక్రమంలో రామా, మహేష్, వంశీకృష్ణ రాజు, రాకేష్, సురేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వైరా, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మునిసిపల్ ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం ప్రారంభించారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్, క్రాస్‌రోడ్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాత బస్టాండ్ తదితర చోట్ల చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. బస్టాండ్‌లో చలివేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ ప్రారంభించి ప్రయాణికులతో మాట్లాడారు. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ప్రారంభించారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇల్లెందు పట్టణానికి చెందిన గాయత్రి కోపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ భూక్య సునీల్ చలివేంద్రానికి కావాల్సిన సామాగ్రిని అందజేసి ప్రారంభించారు.

బోనకల్‌లో...

బోనకల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ పున్నమ్ చందర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ నవీన్ కుమార్, మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, జంపాల రవి, కాలసాని పరుశురాం, కిలారు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సమ్మెకు టీయూసీఐ మద్దతు

వైరా, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఐదురోజుల పనిదినాలు ఉండాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఈనెల 24,25తేదీల్లో జరిగే సమ్మెకు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటామని ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.వెంకన్న, జి.రామయ్య తెలిపారు. గురువారం వైరాలో జరిగిన ఆసంఘం జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు డి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, ఏ.అశోక్, యలదండి బాబు, షేక్.లాల్‌మియా, ఏ.శరత్, సీవై.పుల్లయ్య, కె.పుల్లారావు, పి.రాందాసు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలను చెల్లించాలి'

తల్లాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలని గురువారం తల్లాడ ఎంపీడీవో సురేష్‌బాబుకు గ్రామపంచాయతీ కార్మికులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతినెలా వేతనం అందేలా చూడాలని, పంచాయతీ కార్మికుడు చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఇమ్మడి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బొగ్గుల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి లాజర్, వెంకటేశ్వర్లు, కృష్ణ, దాసు, రవి, నారాయణ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

మార్క్సిస్టు పార్టీ నిర్మాణానికి గంగాధర్ కృషి

» సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి



మాట్లాడుతున్న మాచర్ల భారతి

పెనుబల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నలుగురు మార్క్సిస్టులున్న పెనుబల్లి మండలంలో ఎర్రజెండాను నలుమూలాల విస్తరింపజేసిన మార్క్సిస్టు పార్టీ ముద్దుబిడ్డ చలమాల గంగాధర్‌రావు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. గురువారం వీఎంబంజర్‌లో గంగాధర్‌రావు స్తూపం వద్ద జరిగిన 14వ వర్ధంతి సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కడవరకు ఎర్రజెండాతో నిలిచిన వ్యక్తి గంగాధర్‌రావు అని కొనియాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదినేని రమేష్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, గాయం తిరుపతిరావు, ఐనాల రామలింగేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరి చంద్రశేఖర్, మిట్టపల్లి నాగమణి, నలమల అరుణ్‌ప్రతాప్, కండే సత్యం, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, అన్నపురెడ్డి రవి, బాషా, మిద్దే స్వామి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మధిరటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. మధిర పట్టణం, రూరల్ లో వివిధ గ్రామాలకు చెందిన 13మందికి రూ.6 లక్షల విలువ గల చెక్కులను లబ్దిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నిడమానూరి వంశీ, తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, బాలరాజు, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

పది పరీక్షలకు సర్వం సిద్ధం



వైరాలో నెంబర్లు వేస్తున్న దృశ్యం

వైరా, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైరాలో పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 151మంది, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 167 మంది, గురుకుల బాలికల పాఠశాల(టీజీఆర్ఎస్)లో 190మంది, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్)లో 200 మంది మొత్తం 708మంది విద్యార్థులు ఈ నాలుగు కేంద్రాల్లో ఈ పరీక్షలు రాయనున్నారని ఆయన వివరించారు.



సత్తుపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో నక్కా రాజేశ్వరరావు

సత్తుపల్లిలో...

సత్తుపల్లి: నేటినుంచి జరుగనున్న పది పరీక్షలకు విద్యార్థులు గంటముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సత్తుపల్లి ఎంఈవో నక్కా రాజేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన పట్టణంతో పాటు మండలంలో పది పరీక్షలకు కేటాయించిన 6కేంద్రాలను పరిశీలించారు. సత్తుపల్లి పట్టణంలో 5కేంద్రాలకుగానూ 917మంది, మండలంలోని గంగారంలో 118మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

తల్లాడలో...

తల్లాడ: పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం తల్లాడ మండలంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 150మంది, నారాయణపురం లూర్దుమాత ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 119మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు జరిగాయి. గురువారం పరీక్షల నిర్వహణపై ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్ ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు.



ముదిగొండలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీత ఎల్జిబెత్

ముదిగొండలో...

ముదిగొండ: పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంఈవో రమణయ్య తెలిపారు. మండలంలో 450మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. గురువారం ఆయా పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఎంఈవో వై. ప్రభాకర్ తెలిపారు. గురువారం మధిరలోని టీవీఎం పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. మధిర పట్టణంలో నాలుగు, సిరిపురం గ్రామంలో మరో పరీక్షా కేంద్రం ఏర్పాట్లు చేశామని అన్నారు. మధిర మండలంలో మొత్తం 1,049 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి జరుగనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో సత్తెనపల్లి సత్యనారాయణ తెలిపారు. గురువారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో 750మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారని ఎంఈవో తెలిపారు.

కొణిజర్లలో...

కొణిజర్ల: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు ఎంఈవో అబ్రహం తెలిపారు. మండలంలో నాలుగు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. కొణిజర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షాకేంద్రంలో 234 మంది, తనికెళ్ల ఉన్నత పాఠశాలలో 170 మంది, తనికెళ్ల సెయింట్ అలోసీయేస్ పాఠశాలలో 164 మంది, సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 158 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నాలుగు కేంద్రాలలో 726 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న మండల వైద్యాధికారి రత్నమనోహర్

తల్లాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించిన విద్యార్థులకు గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. స్థానిక జడ్పీఉన్నత పాఠశాలకు చెందిన 22మంది విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ శిరీష, హెచ్ఎం నాగేశ్వరరావు, సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పార్క్‌కు వాటర్ కూలర్ వితరణ

సత్తుపల్లిరూరల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో స్థానిక నీలాద్రి అర్బన్ పార్క్‌కు వాటర్ కూలర్‌ను గురువారం రాత్రి వితరణగా అందించారు. ఈ సందర్భంగా రేంజర్ స్నేహలత మాట్లాడుతూ అర్బన్ పార్క్ సందర్శకులకు చల్లని తాగేనీటిని అందించేందుకు లయన్స్ క్లబ్ ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు దారా కృష్ణారావు, పెనుగొండ రమేష్, సింగరేణి రవి, ప్రసాద్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.